వ్యర్థం..అనర్థం

- తుని మున్సిపాలిటీని వెంటాడుతున్న డంపింగ్ యార్డు సమస్య
- రోడ్లపైనే వ్యర్థాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తుని: తుని మున్సిపాలిటీని ఏళ్ల తరబడి చెత్త సమస్య వేధిస్తోంది. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రధాన రోడ్లు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో పచ్చదనం ఉట్టిపడుతోంది. చెత్త సేకరణకు స్వచ్ఛభారత్ కార్పొరేషన్‌తో పాటు పలు సంస్థలు ఇతోధికంగా సహకరిస్తున్నా డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణంలో చెత్త సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

ఎక్కడికక్కడే వ్యర్థాలు

డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణంలో రోజువారీ ఉత్పత్తి అయ్యే వర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సమస్యను స్థానికులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం కనిపించడం లేదు. ప్రస్తుతం పట్టణ ప్రజలు సీజనల్ జ్వరాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. రహదారులకు చెంతనే వ్యర్థాలు వేయడంతో పందులు అందులో తిష్ట వేస్తున్నాయి. ఇంకా మాకు ఏన్నాళ్లు ఈ చెత్త కష్టాలు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

పట్టణంలో 60 వేలకు పైగా జనాభా ఉన్నారు. 14 వేల కటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి రోజూ 15 వేల మంది వివిధ పనుల కోసం వస్తుంటారు. ఇళ్లు, హోటల్స్, కూరగాయలు, కిరాణా, పండ్లు, తినుబండారాలు తదితర కేటగిరిలో 39 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్నారు. వ్యర్థాలను తడి, పొడి చెత్తగా విభజించి కంపోస్టు యార్డుల(సంపద సష్టి కేంద్రాలు)కు తరలిస్తున్నారు. ప్రధాన మార్కెట్‌లో వచ్చే బల్క్ వ్యర్థాలను పట్టణ శివారు ఇసుకలపేట శ్మశాన వాటిక సమీపంలోకి తరలిస్తున్నారు. వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక పోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలు పేరుకుపోవడంతో పందులు విచ్చ విడిగా స్వైర విహారం చేస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



తుని ఇసుకలపేట డంపింగ్ యార్డులో పేరుకుపోయిన వ్యర్థాలు

కొలిక్కిరాని స్థల సేకరణ

పురపాలక సంఘం ఏర్పడి ఐదు దశాబ్దాలు అవుతున్నా డంపింగ్ యార్డుకు స్థలసేకరణ అందని ద్రాక్షగా మిగిలింది. పట్టణానికి సమీపంలో స్థలసేకరణ చేయాలంటే కోట్లు వెచ్చించాల్సి రావడంతో కార్యరూపం దాల్చలేదు. గతంలో తుని మండలం రేఖవానిపాలెం, ఎస్.చామవరం ప్రాంతాల్లో స్థలసేకరణ కోసం ప్రయత్నించగా అక్కడి ప్రజలు వ్యతిరేకించారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలంటే 3 ఎకరాల స్థలం అవసరం. ఇంత పెద్ద మొత్తంలో సొమ్ములు వెచ్చించే అవకాశం లేక పోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు.

షెడ్లు పూర్తయితే సమస్యకు పరిష్కారం



పట్టణంలో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు డంపింగ్ చేయవద్దని అధికారులను ఆదేశించాం. ఆర్థిక సంఘం నిధులతో తడి, పొడి చెత్త వేరు చేసేందుకు రెండు చోట్ల షెడ్లను నిర్మిస్తున్నాం. ఇవి అందుబాటులోకి వస్తే చెత్తకు పరిష్కారం లభిస్తుంది. స్థలసేకరణకు సంబంధించి తుని మండలం హంసవరం సమీపంలో డి పట్టా భూమిని తీసుకునేందుకు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం లభిస్తుంది.
–ప్రసాదరాజు, కమిషనర్, తుని

వెండింగ్ జోన్స్ ఏర్పాటుకు చర్యలు

తుని: పట్టణ పరిధిలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 లోపు వెండింగి జోన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే వీధి విక్రయదారులను సంఘాలుగా ఏర్పాటు చేసి మహిళా సంఘాల మాదిరిగా బ్యాంకు రుణాలు, సున్నా వడ్డీని ప్రభుత్వ పరంగా అందేలా చూస్తామన్నారు. పట్టణ సీఐ గీతా రామకృష్ణ మాట్లాడుతూ వెండర్స్ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారం చేసుకోవాలన్నారు. జిల్లా మెప్మా అధికారి కె.మోహనకుమార్ మాట్లాడుతూ టౌన్ వెండింగ్ కమిటీ సమావేశాలను ఇకపై ప్రతి నెలా నిర్వహిస్తామన్నారు. చిరు వ్యాపారులు పీఎం స్వానిధి ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా మొదటి విడత చెల్లిస్తే రెండో విడతగా రూ. 2 లక్షలు, మూడో విడతలో రూ. 5 లక్షల వరకు రుణాలు పొందవచ్చన్నారు. వ్యాపారులు రూ.100 చెల్లించి పురపాలక సంఘం నుంచి ఐడీ కార్డు, సరిఫికెట్ తీసుకుంటే ఏడాది పాటు వినియోగంలో ఉంటుందని ఫుడ్ సేఫ్టీ అధికారి సుబ్బారావు తెలిపారు. వీధి వ్యాపారులు సంఘాలుగా ఏర్పడితే రుణాలు మంజూరు చేస్తామని యూబీఐ మేనేజర్ ఎస్కే లాల్ అన్నారు. పలువురు స్ట్రీట్ వెండర్లు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

జగ్గంపేట: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట శివారు సీతానగరంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకూ కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్లు, రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, జ్యోతుల రామస్వామి, వైఎస్సార్ సీపీ నేత కరుటూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

తుని రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. మండలంలోని రేఖవానిపాలెంలో బుధవారం ఎంపీడీఓ పి.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఎస్.సూరవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిపుణులైన డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, మాజీ ఎంపీటీసీ డబ్బ్బారి నాగశివ, మాజీ సర్పంచ్ రామచంద్రరావు, కార్యదర్శి టీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.



సీతానగరంలో రోగులకు సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



రేఖవానిపాలెం సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ రాము

పేదలకు మేలు

తొండంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు ఎంతో మేలు కలుగుతోందని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని జి.ముసలయ్యపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సదినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, దడాల విజయ్, దూలం బాబూరావు, సిరిపిన రమణ, మోసా సత్తిబాబు, యాదాల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం



శాంతిఆశ్రమంలో పీహెచ్‌సీ భవనం శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

- ఎంపీ వంగా గీత
- శాంతి ఆశ్రమంలో నూతన పీహెచ్‌సీ భవనం ప్రారంభం

ప్రత్తిపాడు రూరల్: వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. మండలంలోని శాంతి ఆశ్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ నిధులు రూ.1.18 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వైద్య రంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందుతోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్ఓ డాక్టర్ రమేష్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సరిత, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ కె.విజయభాస్కర్ రెడ్డి, డీఈలు రత్నం రాజు, ఎస్ఎస్ చక్రవర్తి, ఏఈలు ఎం.శేషగిరిరావు, రామకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు మురళీమోహన్‌రెడ్డి, శివకృష్ణ, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు, శంఖవరం మండల కన్వీనర్లు పంచాది వీరబాబు, నరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పెంటపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం

గోకవరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని పెంటపల్లిలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలకు అర్హులు ఎవరైనా ఉంటే గుర్తించి పథకాలు అందిస్తామన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తిరిగి పట్టం కట్టాలని కోరారు. అనంతరం గ్రామంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, బీసీ కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందుల కిట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, మాజీ సర్పంచులు కర్రి అరుణకుమారి, తొట్టా సత్యనారాయణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి శివరామకృష్ణ, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, ఉప సర్పంచ్ దాకారపు ధర్మరాజు, రామకృష్ణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పాల్గొన్నారు.



పెంటపల్లిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

రికార్డుల పరిశీలన

గండేపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డులను ఏపీడీ భానుప్రకాష్ బుధవారం పరిశీలించారు. గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించినట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట ఏపీఓ ఎన్. గంగాభవానీ, ఈసీ రమేష్, తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



కల్యాణ అలంకరణలో స్వామి, అమ్మవార్లు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి, అమ్మవార్ల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

సామర్లకోట: మండలంలోని సచివాలయాల్లో బుధవారం నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు ప్రారంభించినట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉండూరు–1, మాధవపట్నం–1, వేట్లపాలెం–1 సచివాలయాల్లో నిర్వహించామన్నారు. 26న పి.వేమవరం, అచ్చంపేట, వేట్లపాలెం–2 సచివాలయం, 27న చంద్రంపాలెం, పనసపాడు, వేట్లపాలెం–3 సచివాలయం, 28న పవర, గొంచాల, వేట్లపాలెం–4 సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీతానగరం గ్రామాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గ్రామంలో పలు అభివృద్ధికి పనులకు శ్రీకారం

జగ్గంపేట: జగ్గంపేట శివారు సీతానగరం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. సీతానగరంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయాల కన్వీనర్ కరుటూరి వీర్రాజు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతానగరం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా చేయవలసిన ఆవశ్యకతను గుర్తించామన్నారు. గ్రామంలో ఎక్కువ శాతం మంది రైతులే ఉన్నారని, వారికి ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరిస్తానన్నారు. రైతు భరోసా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే చంటిబాబును గ్రామ పెద్దలు, వైఎస్సార్ సీపీ నేతలు పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, జగ్గంపేట మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వుయ్యూరి నాని, వైఎస్సార్ సీపీ నేతలు కరుటూరి వీర్రాజు,చిట్టూరి సూర్యచంద్ర పాల్గొన్నారు.



సీతానగరంలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

సీసీ రోడ్లకు శంకుస్థాపన

తొండంగి: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని కోదాడ కాలనీలో రూ.26 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే సీసీ రోడ్లు నిర్మించారన్నారు. అన్ని పంచాయతీల్లోనూ రోడ్లు, డ్రైన్లుతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు కొయ్యా మురళి, దడాల విజయ్, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బూర్తి కృష్ణ, బద్ది బుజ్జి, బూర్తి విక్టర్, నొక్కు విజయ్‌బాబు, బూర్తి లోవరాజు, మడికి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



కోదాడ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన వైస్ ఎంపీపీ గంగబాబు, పార్టీ నాయకులు

వైభవంగా దుర్గమ్మ నిమజ్జనాలు



ఏలేశ్వరంలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు



జి.కొత్తపల్లిలో కనకదుర్గమ్మ ఊరేగింపు



గోకవరం కనకదుర్గమ్మ ఊరేగింపులో గరగల నృత్యాలు, శక్తివేశాలు

ఏలేశ్వరం: శ్రీదేవీ శరన్నవరాత్రుల ముగింపులో భాగంగా బుధవారం అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ అమ్మవారి విగ్రహాలను మేళతాళాలు, తీన్‌మార్ డ్యాన్సుల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. స్థానిక సంతోషిమాత గుడి వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహంతో పాటు దిబ్బలపాలెంలోని లక్కవరం కాలనీలో అమ్మవారి విగ్రహాలను మెయిన్‌రోడ్, బాలాజీచౌక్, దిబ్బలపాలెం, మార్కెట్‌వీధి, పల్లపువీధి మీదుగా ఊరేగించి ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

శంఖవరం: మండలంలోని కత్తిపూడి, శంఖవరం, జి.కొత్తపల్లి, గౌరంపేట గ్రామాల్లో కనకదుర్గమ్మ నిమజ్జనోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. దేవీనవరాత్రులు ముగియడంతో మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని ఊరేగించి నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గండేపల్లి: దసరా ఉత్సవాలు ముగియడంతో బుధవారం అమ్మవారిని గ్రామాల్లో వైభవంగా ఊరేగించి కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. మండలంలోని నీలాద్రిరావుపేట, మల్లేపల్లి, తాళ్లూరు తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను బ్యాండ్ మేళాలు, తీన్‌మార్ డ్యాన్సుల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కన్నులపండువగా కనకదుర్గమ్మ ఊరేగింపు

గోకవరం: స్థానిక వీరభద్రునిగద్దెలో వెలసిన కనకదుర్గమ్మ ఊరేగింపు బుధవారం కన్నులపండువగా జరిగింది. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని పూల రథంపై ఊరేగించారు. ఊరేగింపులో గరగ నృత్యాలు, నవదుర్గ నృత్యాలు, చిన్నారుల కోలాటం, కేరళ డప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక ఆంజనేయస్వామి గుడి సెంటర్ నుంచి ప్రధాన రహదారిపై పంచాయతీ కార్యాలయం వరకూ ఊరేగింపు జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా శుక్రవారం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతుల సహకారంతో అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బోనాలతో అమ్మవారికి వీడ్కోలు



ప్రత్తిపాడులో బోనాలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ప్రత్తిపాడు: శరన్నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో స్థానిక ప్రత్తిపాడు మునసబు గారి రామాలయం వద్ద ప్రతిష్ఠించిన అభయ దుర్గాదేవి అమ్మవారిని బుధవారం బోనాలతో ఊరేగించి నిమజ్జనం చేశారు. ముత్తయిదవులు, మహిళలు కలశాలను (బోనాలు) శిరస్సున ధరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించి నిర్వహించారు. అనంతరం లంపకలోవ పుష్కర కాలువలో నిమజ్జనం చేశారు.

క్లుప్తంగా

ఇంటి వద్దకే సరకు రవాణా



సమావేశంలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ సత్యనారాయణ

ఏలేశ్వరం: ఏపీఎస్ ఆర్టీసీ పార్శిల్ కౌంటర్ ద్వారా వినియోగదారుల ఇంటి వద్దకే సరకు రవాణా చేస్తామని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్టీసీడిపోలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 25 వరకూ డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం ఇంటి వద్దకే సరకు రవాణా చేస్తామన్నారు. తమ సంస్థ ద్వారా రాష్ట్రంలో 90 శాతం ప్రాంతాలకు రవాణా సౌకర్యం ఉందన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకుడు

జగ్గంపేట: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ కల్వకుంట్ల చంద్రసేన గుప్తా వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు ప్రారంభించారు. శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. రంపచోడవరం గవర్నమెంట్ ఏరియా హాస్పటల్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఆర్యవైశ్య సంఘం నేతలు బొండా నూకబాబు, మానేపల్లి బంగారాజు, వీర్రాజు గుప్తా, వి.నాగసత్య తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మండపం పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ రమణ

శంఖవరం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ ఎస్వీ రమణ సిబ్బందికి సూచించారు. మండలంలోని మండపం పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నిబంధనలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం శేఖర్, సీఆర్పీ డి.రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

భూములకు పాస్‌బుక్‌లు ఇవ్వాలంటూ ధర్నా



ఏలేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలిలో భూదాన భూమి లబ్ధిదారులకు పట్టాదారు పాస్‌బుక్‌లు ఇవ్వాలంటూ పట్టణంలో బుధవారం సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ తిరుమాలిలో భూదాన బోర్డు 19 పట్టాలను 44 మంది పేదలకు ఇచ్చిందన్నారు. పట్టాలను రెవెన్యూ రికార్డుల్లో ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్‌బుక్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాగులాపల్లి అర్జునుడు, దొమ్మేటి లక్ష్మి, పారేపల్లి అర్జమ్మ, సత్తిబాబు, నల్లబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు గోకవరంలో ట్రాఫిక్ ఆంక్షలు

గోకవరం: స్థానిక దేవీచౌక్ కనకదుర్గమ్మ ఊరేగింపును పురస్కరించుకుని గురువారం గ్రామంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు ఎస్సై యువి శివ నాగబాబు బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. ఆ సమయం నుంచి రాజమహేంద్రవరం, రంపచోడవరం మార్గంలో ప్రయాణించే వాహనాలను వీరలంకపల్లి, పెంటపల్లి, రంపయర్రంపాలెం, ఠాకూరుపాలెం, కొత్తపల్లి మీదుగా మళ్లిస్తామన్నారు. రాజమహేంద్రవరం నుంచి గోకవరం ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులు లారీ యూనియన్ కార్యాలయం వద్ద, రంపచోడవరం వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు తంటికొండ వెళ్లే ఆర్చి వద్ద, జగ్గంపేట వైపు నుంచి ఆర్టీసీ బస్సులను డ్రైవర్స్ కాలనీ వద్ద తాత్కాలికంగా నిలుపుదల చేస్తామన్నారు. ప్రయాణికులు, ప్రజలు సహకరించాలని కోరారు.